

కథా కౌముది

# కొండగాలి తిరిగింది..

మధురవాణి

**ప్రపంచంలోని** ఎన్నో కోట్ల మంది కలల తీరం అమెరికా!

ఎన్నెన్నో రంగుల హంగులు, ఆర్భాటాలూ, విలాసాలు, వైభోగాలు కలబోసిన భూతల స్వర్గం. నిస్సందేహంగా ఇది నిజం!

ఈ నిజానికి నిలువుటెత్తు నిదర్శనం లాంటి దృశ్యం. ఇదిగో.. ఇక్కడ చూస్తే తెలియాల్సిందే!

అదొక పెద్ద ఇంద్రభవనం లాంటి ఇల్లు. ఇంటి చుట్టూరా కనుచూపుమేరలో పచ్చదనం, క్రమశిక్షణగా పెరిగిన రకరకాల పూల మొక్కలు, చెట్లు, సరస్సులు, అందంగా అమరిన శిల్పాలతో పూర్వకాలపు చక్రవర్తుల కోటలని, ఉద్యానవనాలని తలపించేలా ఉందా ప్రదేశం.

అంతటి సుందరమైన పరిసరాలతో పోటీ పడుతూ దేవలోకపు వాహనాలని తలపించేలా ఉన్న అత్యాధునికమైన కార్లు వరుసగా ఒక్కొక్కటే అతిథుల్ని చేరుస్తున్నాయి.

కళ్ళు చెదిరే అలంకరణల్లో మెరిసిపోతున్న వారందరినీ చూస్తుంటే లక్ష్మీదేవి దగ్గరి చుట్టాలంతా కట్టగట్టుకుని ఒక్కచోటే పండుగ జరుపుకుంటున్నట్టు, ఆ వైభోగం చూడటానికి రెండు కళ్ళూ చాలవన్నట్టుంది.

ఒక గంటసేపు పలకరింపులు, పులకరింపులు అయ్యాక ఆ ఇంటాయన ఇంద్రుడు గారు భార్య భాగ్యలక్ష్మి గారితో కలిసి వేదిక మీదకు వచ్చి తమ సంబరాన్ని అందరికీ పంచుతూ అతిథులందరికీ ధన్యవాదాలు చెప్పారు.

అందరి మధ్యలోకి వచ్చి నిలబడి చేతిలో గ్లాస్ పైకెత్తి "టు మై పర్ఫెక్ట్ సన్!" అనగానే అతిథులందరి చూపులు అందంగా ముస్తాబై ఉన్న సూర్య మీద వాలాయి. అందరూ పట్టరాని సంతోషంతో బిగ్గరగా జయజయధ్వానాలు చేశారు.

"సూర్య... నీకు పద్దెనిమిదేళ్ళు నిండాయి. లివ్ లైఫ్!" గర్వంగా చెప్పారు ఇంద్రుడు గారు.

'అదృష్టం అంటే ఇంద్రుడు గారిదే!'

'సూర్య లాంటి అద్భుతమైన కొడుకు ఉండటం ఎంతటి మహద్భాగ్యం!'

అందగాడని ఒకరు, బుద్ధిమంతుడని ఒకరు, చదువులో ముందుంటాడని ఒకరు, అమ్మానాన్న మాట జవదాటడు అని మరొకరు... ఇలా వచ్చిన అతిథులందరిలో పద్దెనిమిదేళ్ళ సూర్యని మనసారా మెచ్చుకోనివారు లేరు.

ఆ సాయంకాలం ఆ ఇంద్రభవనంలో దేవలోకాలకి ఏమాత్రం తీసిపోని విధంగా విందు వినోదాలు మహా ఆడంబరంగా జరిగాయి.

★★★★★★★★★★★

ఒక సాయంకాలం తీరిగ్గా తోటలో కూర్చున్నాడు సూర్య.

ఎదురుగా పచ్చటి గడ్డిలో బుజ్జి కుక్కపిల్ల అలుపనేది తెలీకుండా అదే పనిగా తన తోకని తానే తరుముతూ గుండ్రంగా తిరుగుతోంది.

"సూర్యా, నేను పది రోజుల కోసం ఇండియా వెళుతున్నాను. బిజినెస్ ట్రిప్. అమ్మ కూడా వస్తానంటుంది. నువ్వు కూడా మాతో వస్తే ఇండియాలో ఉన్న మన బంధుమిత్రులందరికీ గ్రాండ్ పార్టీ ఇద్దాం" అన్నారు ఇంద్రుడు గారు వచ్చి.

వెంటనే సరేనన్నాడు సూర్య అలవాటుగా.

అనుకున్నదే తడవుగా చకచకా ఏర్పాట్లు జరిగిపోయాయి.

★★★★★★★★★★★

హైదరాబాదులో మరొక పెద్ద ఇంద్రభవనములో దిగారు సూర్య కుటుంబం. బంధుమిత్రులందరి మధ్య మరొకసారి అత్యంత వైభవంగా దేవతా విందు జరిగింది. వచ్చినవారంతా ఇంద్రుడు గారి అదృష్టానికి సంతోషించి తమ శుభాకాంక్షలు వారి చేతికిచ్చి వెళ్ళారు.

ఈ సంబరాలతో ఉబ్బితబ్బిబ్బైపోయిన భాగ్యలక్ష్మి గారి మనసులో ఒక కోరిక కలిగింది. ఎప్పుడో సూర్యకి సంవత్సరం వయసున్నప్పుడు తిరుమల వెళ్ళిందావిడ. మళ్ళీ ఇప్పుడొక్కసారి వెళితే బాగుండుననిపించింది. పుత్రోత్సాహంలో ఉన్న ఇంద్రుడు గారు భాగ్యలక్ష్మి గారి కోరిక ప్రకారం క్షణాల మీద తిరుమల ప్రయాణ సన్నాహాలు జరిపించారు.

★★★★★★★★★★★

ఇంద్రుడి గారి కుటుంబం తిరుపతిలో విమానం దిగి ఒక పెద్ద హోటల్లో కాసేపు సేద తీరాక కారులో తిరుమలకి ప్రయాణం అయ్యారు.

ఊరంతా ఎక్కడ చూసినా చీమల పుట్ట పగిలినట్టు కుప్పలుతెప్పలుగా ఉన్న జనాలని చిత్రంగా చూస్తున్నాడు సూర్య.

"కాలినడకన కొండ ఎక్కుతారా సామీ..?" అడిగాడు కారు డ్రైవరు.

ఇంద్రుడు గారు సమాధానం చెప్పేలోపే "నేను ఎక్కుతాను" అన్నాడు సూర్య.

ఆశ్చర్యంగా చూశారు తల్లీతండ్రీ ఇద్దరూ.

"ఎందుకూ ఎక్కడం? కారులో వెళదాం" అన్నారు ఇంద్రుడు గారు.

"నేను ఎక్కుతాను" అన్నాడు సూర్య మళ్ళీ.

"ఒక్కడికే విసుగ్గా ఉంటుంది. పైగా ఇక్కడ నీకంతా కొత్త!" సర్ది చెప్పబోయారు ఇంద్రుడు గారు.

"మా తమ్ముడు ఉన్నాడండి సూరి అని. మా చిన్నాయన కొడుకు. వాడు వారంలో రెండు మూడు సార్లయినా కొండ ఎక్కుతుంటాడు. అబ్బాయితో కూడా ఉండి, భద్రంగా మీ హోటల్ దగ్గరికి తీసుకువస్తాడు." అంటూనే క్షణాల్లో ఫోన్ చేసి వాళ్ళ తమ్ముడు సూరిని పిలిపించాడు డ్రైవరు.

ఎప్పుడూ ఏదీ అడగని సూర్య సరదాని కాదనలేక ఊరకుండిపోయారు ఇంద్రుడు గారు.

బాగా పాతదైపోయిన టీషర్టు, చిరుగులున్న జీన్స్, నల్లటి ఉంగరాల జుట్టుతో సన్నగా, పొడుగ్గా ఉన్న ఒక ఇరవయ్యేళ్ళ అబ్బాయి వచ్చాడు.

అతని మొహంలో తమని చూసి ఎటువంటి ప్రత్యేక భావమూ ప్రదర్శించకపోవడం ఇంద్రుడు గారికి నచ్చలేదు.

'అలిపిరి మెట్టు' దగ్గర సూర్యని సూరికి అప్పచెప్పి ఇంద్రుడి గారిని సతీమణితో సహా కారులో తీసుకెళ్ళిపోయాడు డ్రైవరు.

"సూర్య కూడా మనతో పాటే కారులో వచ్చేస్తే బాగుండేది" ఏదో తెలియని ఇబ్బంది పడుతూ అన్నారు ఇంద్రుడు గారు.

"పరవాలేదులే సామీ.. ఆ బిడ్డకి ఏదో బుద్ధి పుట్టింది కదా! పిల్లకాయలు ఆడుతూ పాడుతూ ఎక్కినా నాలుగు గంటల్లో పైకి వచ్చేస్తారు. ఎన్నెన్ని కోటానుకోట్లమంది ఎక్కిన ఏడుకొండలు సామీ ఇవి.. గోవిందా గోవిందా!" భక్తి పారవశ్యంతో అన్నాడు డ్రైవరు.

ఏం మాట్లాడాలో తోచలేదు ఇంద్రుడు గారికి.

తాను ఎక్కలేకపోయినా కొడుకు ఏడుకొండలు ఎక్కుతాననడం ఎందుకో సంతోషాన్నిచ్చింది భాగ్యలక్ష్మి గారికి.

కారు నిటారుగా నిలబడి ఉన్న ఏడు కొండలని ఎక్కాలన్న ఆత్రంతో వేగంగా ముందుకి పరుగు తీసింది.

★★★★★★★★★★★

సూర్య సూరి వెంట నడిచాడు. అల్లంత ఎత్తున ఠీవీగా చేతులు జోడించి నించున్న పక్షిరాజు గరుత్మంతుడికి నమస్కారం చేసి మెట్లు ఎక్కడం ప్రారంభించారు.

"నువ్వు చెప్పులు వేసుకోలేదేం? చాలా మెట్లు ఎక్కాలి కదా!" సూరి పాదాల వంక చూస్తూ అడిగాడు సూర్య.

"నువ్వు చెప్పులు వేసుకున్నావెందుకు? ఏడుకొండలు తెలియాల్సింది నీకా, చెప్పులకా?" అన్నాడు సూరి.

ఒక్క క్షణం సూరి మొహంలోకి వింతగా చూసి చెప్పులు విప్పి చేత్తో పట్టుకుని, 'వీటిని ఏం చెయ్యాలి' అన్నట్టు చూశాడు సూర్య.

"లెస్ లగేజ్.. మోర్ కంఫర్ట్!" చప్పున చెప్పాడు సూరి.

తన చేతిలో ఉన్న అమెరికన్ బ్రాండెడ్ చెప్పుల్ని పక్కకి పడేస్తూ "నువ్వేం చదువుకున్నావు?" అడిగాడు సూర్య.

"నేను టెన్త్ క్లాస్ పాస్. ఇంగ్లీషు పెద్దగా రాదు. ఇందాక చెప్పింది చిన్నప్పటి నుంచీ రైల్వేస్టేషను గోడల మీద చదివిందేలే" నవ్వాడు సూరి.

"మరి చెప్పుల గురించి చెప్పింది ఎక్కడ నేర్చుకున్నావు?"

"అందులో నేర్చుకునేది ఏముంది? నీ చెప్పులకి తెలిసేది నీకెలా తెలుస్తుంది?"

"చెప్పులకి తెలిసేది ఏం ఉంటుంది?" వింతగా అడిగాడు సూర్య.

"నువ్వు అమెరికా నుంచి వచ్చావు కదా, చాలా పుస్తకాలు చదువుకుని ఉంటావు. చాలా విషయాలు తెలిసి ఉంటాయి. అవునా?"

"అవును. కానీ ప్రాణం లేని చెప్పులకి ఏం తెలుస్తుంది?"

"చెప్పులకి ప్రాణం ఉందో లేదో నాకు తెలీదు. కానీ చెప్పులు లేకుండా నడిస్తే నీ కాళ్ళకి కొండ గుర్తు తెలుస్తుంది."

తనకి తెలియని తెలుగు భాషేదో కొత్తగా మాట్లాడుతున్నాడేమో సూరి, అందుకే అతని మాటలు వింతగా ఉన్నాయనిపించింది సూర్యకి.

"నువ్వు వారంలో రెండు మూడు సార్లైనా కొండ ఎక్కుతావట. ఎందుకన్నిసార్లు ఎక్కుతావు?"

"ఎక్కాలనిపిస్తుంది. ఎక్కుతాను!"

కాసేపు ఇద్దరూ ఏమీ మాట్లాడకుండా మౌనంగా మెట్లు ఎక్కసాగారు.

శరత్కాలపు రాతిరంతా వెన్నెల ధారల్లో మత్తుగా తడిసి పొద్దటి నీరెండలో నిమ్మళంగా నిదురిస్తున్నట్టున్న పచ్చటి చెట్లు చూస్తూ సరికొత్త పరవశమేదో కలిగింది సూర్యకి.

"గోవిందా... గోవిందా... ఏడుకొండల వాడా.. వెంకటరమణా.. ఆపదమొక్కుల వాడా... అనాథరక్షకా... గోవిందా... గోవిందా..." ఇలా ఏదో ఒక వైపు నుంచి నిరంతరాయంగా వేంకటేశ్వరుని స్తుతే వినపడుతోంది.

మెట్లెక్కే వారందరినీ పరీక్షగా చూస్తున్నాడు సూర్య.

కొంతమంది కుటుంబం మొత్తం పిల్లాజెల్లా పెద్ద పటాలంతో మహా సరదాగా విహారయాత్రకు వచ్చినట్టు ఉన్నారు. కొంతమంది యువతీయువకులు జీన్స్, టీషర్ట్ వేసుకుని జాలీగా ఎక్కుతున్నారు. కొంతమంది చాలా ధనవంతులు, ఉన్నత కుటుంబాల నుంచి వచ్చినవారని తెలిసిపోతోంది.

మరికొంతమందిని చూస్తుంటే 'అసలు వీళ్ళు చివరిదాకా మెట్లన్నీ ఎక్కగలరా?' అన్న అనుమానం కలుగుతోంది. అంత వ్యయప్రయాసలకోర్చి మెట్లు ఎక్కుతున్నారు. వాళ్ళల్లో కొంతమంది బట్టలు చూస్తుంటే ఏదో చిన్న చిన్న పనులు చేసుకుని పొట్టపోసుకునే వాళ్ళని తెలుస్తోంది. వాళ్ళ మొహాల్లో అలసట లేకపోగా ఏదో ఆనందం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వాళ్ళ ఆనందానికి కారణం ఏమై ఉంటుంది!?

ఇన్ని రకాల మనుషులు ఎందుకింత కష్టపడి ఈ కొండ ఎక్కుతున్నారు? ఏదో వస్తుందని మూఢనమ్మకమేమో పాపం!

ఆలోచన లోతైన కొద్దీ విడ్డూరంగా అనిపించింది సూర్యకి.

"డబ్బులుండి సుఖపడుతున్నవాళ్ళు దేవుడికి కృతజ్ఞతగా, డబ్బుల్లేక కష్టపడేవాళ్ళు తమ కోరికలు తీరడానికి ఇలా గుళ్ళూ గోపురాలు తిరుగుతారంటావా సూరీ?"

"నిజమే! కానీ, డబ్బులుండి కష్టాలు అనుభవించేవాళ్ళు, డబ్బుల్లేకపోయినా ఆనందంగా ఉండేవాళ్ళు కూడా ఎక్కుతుంటారు" నవ్వాడు సూరి.

వీళ్ళకి పది మెట్ల ముందు నడుము, కాళ్ళు వంగిపోయిన ఒక అవ్వ అతికష్టం మీద పైకెళుతోంది. గభాలున ఒక్క పరుగులో అవ్వ దగ్గరికెళ్ళి భుజం చుట్టూ చేతులేసి "నీకెందుకవ్వా ఇంత కష్టం? చీరలు, సొమ్ములు కావాలా?" వేళాకోళం చేశాడు సూరి.

"చీరలు, సొమ్ములు నాకెందుకయ్యా! ఏదో ఈ కాళ్ళు పని చేయకుండా పోయేలోపు ఇంకొక్కసారి ఆ ఏడుకొండలవాడిని చూద్దామని ఆశ" అంది అవ్వ నిదానంగా.

"అదే, చూసి ఏం చేద్దామనో చెప్పు. ఇదిగో ఈ అబ్బాయి అమెరికా, అంటే చానా దూరదేశం నుంచి వచ్చాడు. నువ్వు ఎందుకు ఇంత కష్టపడుతున్నావని అడుగుతున్నాడు."

"అంత దూరం నుంచి ఏడుకొండలవాడిని చూద్దామని వచ్చావా నాయనా! ఎంత బుద్ధిమంతుడివి.. నువ్వు చల్లగా ఉండాలి."

"చల్లగా ఉంటాడు సరే, నువ్వు ఎందుకు కొండ ఎక్కుతున్నావో చెప్పు ముందు" రెట్టించాడు సూరి.

"ఎందుకంటే ఏముంది బాబూ! ఎందుకు పుట్టామో తెలుసా, ఎందుకు పోతామో తెలుసా, నాకంత పెద్ద సంగతులు తెలియవు. కొండ ఎక్కితే మనసు నిండిపోతాది. అంతే! గోవిందా గోవిందా..." అతి మామూలుగా చెప్పింది అవ్వ.

"నేను నిన్ను ఎత్తుకుని తీసుకుపోతా రా అవ్వా.." సూరి అన్నాడు.

"వద్దయ్యా, అంత మాటన్నావు చాలు. నా ఆయువు కూడా పోసుకుని చల్లగా ఉండు నాయనా.. గోవిందా గోవిందా.." అంటూ ముందడుగు వేసింది అవ్వ.

కుర్రాళ్ళిద్దరూ పరుగు తీస్తూ హుషారుగా అవ్వని దాటి ముందుకు సాగారు.

"ఆ అవ్వ మీ బంధువులా?"

"కాదు. ఇదే మొదటిసారి చూడ్డం. నీ ప్రశ్నలకి నేనొక్కడినే సమాధానాలు చెప్పలేక ఆ అవ్వని అడిగాను" గట్టిగా నవ్వాడు సూరి.

"నీకేం సందేహాలు  రావా? అవ్వ కూడా 'ఎందుకు పుట్టామో' అని ప్రశ్న వేసింది కదా?"

"అవ్వ ప్రశ్నలు వేయలేదు. తనకి తెలీదని చెప్పింది. ఎంతైనా మీలాగా బాగా చదువుకున్నోళ్ళకి పుట్టల కొద్దీ ప్రశ్నలు వస్తాయి. మాకు రావు ఇలాంటి అనుమానాలు. అయినా సందేహంతో ఆగిపోక ఇంకాస్త ముందుకి పోతే కొత్తగా ఏమైనా తెలియవచ్చే అవకాశం ఉంటుందేమో!?"

"ఊఁ.. " సూర్య ఆలోచన మరింత పదునెక్కుతోంది.

"రెండొంతుల పైన ఎక్కేసాం తెలుసా? మొత్తం 3550 మెట్లు. ఇంకో 1000 ఎక్కాలంతే!" ఉత్సాహంగా చెప్పాడు సూరి.

"అప్పుడే అయిపోతోందా?" సూర్య గొంతులో నిరాశ.

"నీక్కూడా మళ్ళీ ఇంకోసారి ఎక్కితే బాగుండనిపిస్తుందా?

నీలాగే బాగా చదువుకున్న ఒక అక్క వచ్చింది ఏడాది క్రితం. తన పేరు వాణి. పాతికేళ్ళ వయసుంటుంది. చిన్నపిల్లలకి సంగీతం నేర్పిస్తుందట. బెంగళూరు నుంచి వచ్చింది. మనం బయలుదేరాక మొదట్లో ఒక విగ్రహం చూపించాను కదా, పురందరదాసు. ఆయన కర్ణాటక సంగీతానికి తండ్రి లాంటి వారట. ఆయన అపారమైన ధనసంపదలని తృణప్రాయంగా వదిలేసి హరిదాసులా మారి లక్షల కీర్తనలు పాడుతూ జీవించారని చెప్పింది. నాకు సంగీతం గురించి ఏమీ తెలియదులే కానీ ఆయన విగ్రహం ముందు కూర్చుని అక్క ఒక పాట పాడింది. ఎంత కమ్మగా పాడిందనీ.. నేను ఎప్పటికీ మర్చిపోలేను! 'మానవ జన్మ' అన్న పదమొక్కటే నాకు అర్థమైంది. అది కన్నడ భాషట. భాష తెలీకపోయినా ఎంతో ఆనందం కలిగింది. కళ్ళల్లో నీళ్ళొచ్చాయంటే నమ్ము." మెరుస్తున్న కళ్ళతో చెప్పాడు సూరి.

ఆ జ్ఞాపకాన్ని గుర్తు చేసుకుంటున్నప్పుడు సూరి మొహంలో తారాడిన భావం ఏమిటో సూర్యకి అంతుపట్టలేదు.

సూర్య పుట్టి బుద్ధెరిగాక ఇంతవరకూ తనకు తెలిసిన ప్రపంచంలో, తనకి తెలిసిన మనుషుల మధ్యన ఇంత వైరుధ్యం ఎప్పుడూ కనిపించలేదు. కానీ, ఇక్కడ మనుషుల్ని చూస్తుంటే తనకు అర్థం కానిది ఏదో ఉందనిపిస్తోంది. అదేమిటో!?

మరొక గంట సేపటికి మెట్లన్నీ ఎక్కడం పూర్తయిపోయింది.

మౌనంగా సూరిని అనుసరిస్తూ పోతున్నాడు సూర్య. ప్రశ్నలేమీ అడగడం లేదు.

తాను ఆలోచనల్లో ఉండగానే చేరాల్సిన గమ్యానికి తీసుకొచ్చేశాడు సూరి.

సూర్య చేతిలో ఫోను మోగుతుండగానే "నా పని పూర్తయ్యింది. ఉంటాను" అంటూ నవ్వుతూ వెనుతిరిగాడు సూరి.

"ఎన్నిసార్లు కాల్ చేసినా ఆన్సర్ చేయవేంటి సూర్యా? అమ్మ కంగారుపడుతోంది నీ గురించి" ఇంద్రుడి గారి అసహనం స్పష్టంగా తెలిసిపోతోంది.

"హోటల్ ముందే ఉన్నాను. రూమ్ నంబర్ ఎంత?" నిదానంగా అడిగాడు సూర్య, దూరంగా కనుమరుగైపోతున్న సూరికేసి చూస్తూ!

★★★★★★★★★★★

నాలుగు రోజుల తర్వాత..

ఇంద్రభవనంలో తండ్రీకొడుకుల మధ్యన వాదన జరుగుతోంది. తల్లి కళ్ళు తుడుచుకుంటూ వారిద్దరినీ చూస్తోంది.

"ఏంటీ !? నువ్వు ఇండియాలోనే ఉండిపోతావా? ఉండి ఏం చేస్తావు?"

"ఇక్కడంతా తిరిగి చూడాలని ఉంది."

"నీకంతగా ప్రపంచం చూడాలనుంటే చెప్పు. ప్రపంచంలోని అత్యద్భుతమైన ప్రదేశాలన్నీ నేను చూపిస్తాను."

"ఊహూ.. అవన్నీ కాదు. ఇండియా చూడాలి. నేనే చూడాలి. అలా ఊర్లూ, మనుషులూ, చెట్లు, పిట్టలు, రాళ్ళు, కొండలు, ప్రతీదీ చూడాలి. అవన్నీ చూస్తూ పోతే ఏమి కనిపిస్తుందో తెలుసుకోవాలి" నిశ్చయంగా చెప్పాడు సూర్య.

"నేను ఎక్కడ పుట్టి, ఎలా పెరిగానో, ఇంత ఎత్తుకు ఎలా ఎదిగానో నీకు బాగా తెలుసు. ఏమీ లేని స్థాయి నుంచి ఇంత దూరం రావడానికి ఎంత శ్రమపడ్డానో కూడా నీకు తెలుసు. ఈ రోజు నీకున్న గొప్ప పేరు, ఆస్తులు, విలాసాలు, వైభోగాలు.. వీటన్నిటి కోసం ఎన్ని కోట్ల మంది తపించిపోతున్నారో తెలుసా? నీకు పిచ్చి పట్టింది సూర్యా!" ఆక్రోశించారు ఇంద్రుడు గారు.

"మీరు జీవితంలో స్వశక్తితో ఎంతో సాధించారు నాన్నా! ఎన్నో లక్షలమంది కలలు కనే జీవితాన్ని సొంతం చేసుకున్నారు. అందుకు మీ మీద నాకు చాలా గౌరవం ఉంది. మీ కష్టం విలువ కూడా నాకు తెలుసు. కానీ, మీ కలల్ని నేను వేటాడలేను. నేనూ మీలాగే సంతోషానికి నాదైన సొంతదారి వెతుక్కుంటే తప్పు లేదంటాను" ప్రశాంతంగా, స్పష్టంగా చెప్పాడు సూర్య.

"వినడానికి కవిత్వంలా బానే ఉంటుంది. కానీ, నువ్వు పుట్టి పెరిగిన భోగభాగ్యాలు, సౌఖ్యాలు, సౌకర్యాలు లేకపోతే అప్పుడు తెలిసొస్తుంది నీకు సంతోషం అంటే ఏమిటో! పది రోజుల్లో పరిగెత్తుకుంటూ వెనక్కి వస్తావు."

"కానీ నాన్నా.. మీరనే సౌఖ్యాలు, సౌకర్యాలు లేనప్పుడు కూడా నేను ఆనందంగా ఉండగలిగితేనో!?"

"......."

★★★★★★★★★★★

సూర్యాస్తమయపు రంగుల్లో వెలిగిపోతున్న ఆకాశం దివ్యలోకాలని తలపిస్తూ మనోహరంగా ఉంది.

దూరంగా పచ్చటి గడ్డిలో బుజ్జి కుక్కపిల్ల అలుపనేది తెలీకుండా అదే పనిగా తన తోకని తానే తరుముతూ గుండ్రంగా తిరుగుతోంది.

ఇంద్రుడు గారు స్నేహితుడితో ఫోనులో మాట్లాడుతున్నారు.

"అందరిలాగా వెంట వెంటనే విరామం లేకుండా చదువులు, సంపాదన అంటూ పరుగులు పెట్టాల్సిన అవసరం నీకేమిటి సూర్యా? సరదాగా రెండు మూడేళ్లు ప్రపంచం చుట్టి రా, అని నేనే చెప్పాను సూర్యకి. ఇండియాతో మొదలు పెట్టి ప్రపంచమంతా తిరిగి వస్తాడు" గర్వంగా చెప్తున్నారు ఇంద్రుడు గారు.

"అద్భుతం! మనవాళ్ళలో ఇంత గొప్పగా చేయగలిగిన వారు లేనే లేరు. ఏం చేసినా మీకే చెల్లు. మీకు మీరే సాటి. మీ సూర్య లాంటి కొడుకు కోటికొక్కరైనా ఉంటాడా! ఇంద్రుడు గారూ, అదృష్టమంటే మీదేనండీ!" అభినందనల వెల్లువ సాగిపోతోంది.

ఇంద్రుడు గారు సంతృప్తిగా నవ్వుతూ ఫోన్ పెట్టేశారు.

★★★★★★★★★★★

తూరుపు కనుమల్లో అప్పుడప్పుడే తెలవారుతుండగా లేత సూర్యకిరణాల చప్పుడు వింటూ దూరంగా కనిపిస్తున్న ఎత్తైన కొండ శిఖరాలకేసి తన ప్రయాణం మొదలుపెట్టాడు సూర్య.

కొండగాలి తిరిగింది.. గుండె మురిసిపోయింది.. ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయింది!

మానవ జన్మ దొడ్డదు.. ఇద హాని మాడలు బేడి హుచ్చప్పగళిరా.. మానవ జన్మ దొడ్డదు..

COMMENTS